www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 17 మార్చి 2025
5
చిత్తూరు



నేడు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక


ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: సోమవారం చిత్తూరు కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కారవేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సల్ సిస్టం) కార్యక్రమంను ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కలెక్టరేట్‌లోని సమావేశపు మందిరంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జి.విద్యాధరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు ఉదయం 9 గంట కల్లా తప్పక హాజరు కావాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఆదేశించారు. అలాగే నియోజక వర్గ, మండల స్థాయిలో జరిగే ప్రజాసమస్యల పరిష్కారవేదికలో నియోజకవర్గ, మండలస్థాయి అధికారులందరూ విధిగా హాజరుకావాలని ఆదేశించారు.

భవిష్యత్తుకు విద్యార్థులు సిద్ధం..

నేటి నుంచి పదో తరగతి పరీక్షలు..

ప్రతి విద్యార్థి తమ పునాదులను పదో తరగతి మార్కుల ద్వారానే రూపొందించుకుంటారు. అధిక మార్కులు వచ్చిన విద్యార్థులు ఇంజనీరింగ్ వైపు.. తక్కువ మార్కుల ద్వారా తమ సామర్థ్యాన్ని గుర్తించి ఇతర గ్రూపులను ఎంచుకుంటారు. భవిష్యత్తులో వారి స్థితిగతులను నిర్ణయించుకోవడానికి పదో తరగతి మార్కులే.. తొలిమెట్టు అని చెప్పడానికి ఎలాంటి సందేహము లేదు. తమ భవిష్యత్తును నిర్ణయించే పది పరీక్షలకు విద్యార్థులు సిద్ధంగా ఉన్నారు.





ప్రజాశక్తి- పూతలపట్టు: పది పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించి తమ సామర్థ్యాన్ని నిరూపించుకోవడానికి విద్యార్థులు అనేక విధాలుగా ఏడాది పాటు శ్రమించారు. పాఠశాలలతో పాటు, ప్రత్యేక తరగతులని ఏడాది పొడవునా ఎంతో శ్రమించారు. ఇటు ఉపాధ్యాయులు, అటు తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలన్న లక్ష్యంతో విద్యార్థులు ఊవిల్లూరుతున్నారు. పరీక్షలకు సంబంధించి అధికారులు అన్ని కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నారు. మరో కొన్ని గంటల్లో ప్రారంభం కానున్న పరీక్షలు విద్యార్థుల భవిష్యత్తును తేల్చనున్నాయి.

మండలంలోని పరిస్థితి

పూతలపట్టు మండలంలో పోలవరం, ఎర్రచెరువుపల్లి, పి.కొత్తకోట, ఎం బండపల్లి, పూతలపట్టు ఐదు పరీక్షా కేంద్రాల్లో 523 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. పూతలపట్టు పరీక్షా కేంద్రంలో 135, పోలవరం 56, ఎర్ర చెరువుపల్లి 100, పి కొత్తకోట 125, ఎం బండిపల్లి 107 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు.

దూర విద్యార్థులకు తప్పని అగచాట్లు

పరీక్షా కేంద్రాలకు దూరంగా ఉన్న విద్యార్థులకు అవస్థలు తప్పేటట్లు లేవు. బస్సు వసతి గల విద్యార్థులు సమయానికి పరీక్షా కేంద్రానికి చేరుకోవడానికి ఇబ్బందులు లేకపోవచ్చు. కానీ బస్సు వసతి లేని విద్యార్థులకు మాత్రం ఇబ్బందులు తప్పవు. మండలంలోని గొడుగు చింత ఉన్నత పాఠశాల నుంచి ఏడు మంది విద్యార్థులు పి కొత్తకోట పరీక్షా కేంద్రాన్ని చేరుకోవడానికి సుమారు ఐదు కిలోమీటర్ల దూరం ఉంటుంది. కానీ ఈ మార్గంలో ఎలాంటి బస్సు వసతులు లేవు.. విద్యార్థులు తమ సొంత డబ్బులతో ఆటోల ద్వారా పరీక్షలకు వెళ్లాల్సి ఉంది. అదేవిధంగా గురుకుల పాఠశాలలోని 75 మంది విద్యార్థులు పరీక్షా కేంద్రానికి వెళ్లాలంటే సుమారు రెండు కిలోమీటర్ల దూరం ఉంది. ఈ మార్గంలో కనీసం ఆటో సౌకర్యం కూడా లేనందున నడకే వీరికి మార్గం.

కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నాం..

- మధు ఎంఈఓ పూతలపట్టు



పరీక్షా కేంద్రాల వద్ద విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులు పడకుండా అన్ని చర్యలు తీసుకున్నాం. దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులకు ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం కల్పించింది. బస్సు సౌకర్యం లేని విద్యార్థులు తమ కనుగుణంగా రావాల్సి ఉంటుంది. నిర్దేశించిన సమయానికే విద్యార్థులు పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకోవాలి.

నేటి నుంచి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు

సోమల: మండలంలోని మూడు పరీక్ష కేంద్రాలలో నేటి నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు కేశవరెడ్డి, శివరత్నమ్మ తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సోమలలో 80 మంది విద్యార్థులు, కందూరు ఉన్నత పాఠశాలలో 140 మంది విద్యార్థులు, పెద్ద ఉప్పరపల్లి జడ్పీ హైస్కూల్‌లో 180 మంది విద్యార్థులు పబ్లిక్ పరీక్షలు రాయనున్నారని మొత్తం 400 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు వారు తెలిపారు. పరీక్ష కేంద్రాలలో విద్యార్థులకు డెస్కు, తాగునీరు, ఫ్యాన్లు, గదులలో లైటింగ్ సౌకర్యం ఏర్పాటు చేశామని పోలీసు యంత్రాంగం ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించడం, వైద్యశాఖ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపులు నిర్వహించడం చేస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు సకాలంలో పరీక్షకు హాజరై పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.





ఎంఈఓలు కేశవరెడ్డి, శివరత్నమ్మ

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు: ఎస్సై శివ శంకర్

మండలంలో సోమవారం నుండి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు నిర్వహిస్తున్న పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నట్లు ఎస్సై శివశంకర్ తెలిపారు. విద్యార్థులు సమయపాలన పాటించి పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని పరీక్ష కేంద్రానికి సమీపంలోని జిరాక్స్ సెంటర్లు, నెట్ సెంటర్లు తెరవరాదని, ఇతర వ్యక్తులు పరీక్ష కేంద్రాల వద్ద ఉండరాదని, ఫేక్ న్యూస్‌లో వదంతులు ప్రచారం చేయడం వ్యాప్తి చేయడం చేస్తే అలాంటి వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో విద్యార్థులు పరీక్షలు రాసేందుకు ప్రజలు కూడా సహకరించాలని అన్నారు.

పది పరీక్షలకు సర్వం సిద్ధం

- విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి
- సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోండి
- జిల్లా ఇన్చార్జి కలెక్టర్ జి. విద్యాధరి

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: పదో తరగతి పరీక్షల నిర్వహణ ఏర్పాట్లు పూర్తి చేశామని, పరీక్షలో విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని, సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఇన్‌చార్జి కలెక్టర్ విద్యాధరి పేర్కొన్నారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటనలో 17వ తేది సోమవారం నుండి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు పదో తరగతి పరీక్షలు నిర్వహించడం జరుగుతోందన్నారు.

పరీక్ష సమయం: పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45గంటల వరకు ఉంటుందని మొత్తం 118 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశామని, ఇందులో ఏ క్యాటగిరీ పరీక్షా కేంద్రాలు 38, బి క్యాటగిరీ 37, సి క్యాటగిరీ 43 ఉన్నట్లు పేర్కొన్నారు. సోమవారం నుండీ ప్రారంభం కానున్న పది పరీక్షలకు రెగ్యులర్, ప్రయివేట్ మొత్తం 21,248 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఇందులో రెగ్యులర్ విద్యార్థులు 20,954 కాగా బాలురు 10,802, బాలికలు 10,152 మంది, ప్రయివేటు విద్యార్థులు మొత్తం 294 ఇందులో బాలురు 203, బాలికలు 91 మంది ఉన్నారు.


పరీక్షలు ఇలా... 17 సోమవారం మొదట భాష పేపర్ (గ్రూప్ -ఏ) (కాంపోజిట్ కోర్స్), 19 (బుధవారం)- రెండవ భాష , 21 (శుక్రవారం) -ఇంగ్లీష్, 22, (శనివారం) మొదటి భాష పేపర్-2 **(కాంపోజిట్ కోర్స్)** **సమయం:** ఉదయం 9.30 నుండి 11.15 గంటల వరకు.. ఓఎస్-ఎస్‌సి ప్రధాన భాష పేపర్ (సంస్కృతం, అరబిక్, పార్సియన్) సమయం: ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు, 24 (సోమవారం)- గణితం, 26 (బుధవారం)- భౌతిక శాస్త్రం సమయం: ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు, 28 (శుక్రవారం)- జీవశాస్త్రం సమయం ఉదయం 9.30 నుండి 11.30 గంటల వరకు, 29 (శనివారం) ఓఎస్ఎస్‌సి ప్రధాన భాష పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పార్సియన్), ఓఎస్ఎస్‌సి వృత్తిపరమైన కోర్సు (థియరీ) పరీక్షలు సమయం: ఉదయం 9.30గంటల నుండి 11.30 గంటల వరకు, 31 (సోమవారం) సామాజిక శాస్త్రం (సోషియల్ స్టడీస్) పరీక్షలు నిర్వహణ. పది పరీక్షల నిర్వహణలో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు 8 ఏర్పాటు చేశారు. 11 సమస్యాత్మక పరీక్షా కేంద్రాలల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు, 37 స్టోరేజ్ పాయింట్స్, 118 చీఫ్ సూపరింటెండెంట్లు, 40 సిట్టింగ్స్ స్క్వాడ్స్ ఏర్పాటు చేశామన్నారు.

పటిష్ట బందోబస్తు..

పరీక్షా కేంద్రాల వద్ద 163 భారత న్యాయ సంహిత నియమాలు వర్తిస్తాయి. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడితే చర్యలు తీసుకోన్నారు. పరీక్షా కేంద్రంలోనికి విద్యార్థులు, ఇన్విజిలేటర్లు సహా ఎవరు ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదు. పరీక్షా కేంద్రాలలో ఫస్ట్ ఏయిడ్ కిట్లు, ఓఆర్ఎస్ఎస్ ప్యాకెట్లు, అందుబాటులో వైద్యసిబ్బంది ఉంటారు. పరీక్షా కేంద్రాలలో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాల్లో భాగంగా తగినంత లైటింగ్, మంచినీరు అందించడం. నీటి వసతితో కూడిన మరుగుదొడ్ల సౌకర్యం. దూర ప్రాంత విద్యార్థులు పరీక్షలకు సకాలంలో చేరుకొనేలా బస్సులు నడిపేలా ఆర్‌టిసి అధికారులు చర్యలు తీసుకోవడం జరిగింది. అలాగే పరీక్షా కేంద్రాలలో నిరంతర విద్యుత్ సరఫరా, పారిశుధ్య పనులను మెరుగ్గా చేపట్టాలని, ప్రశ్నాపత్రాలు, జవాబుపత్రాల తరలింపుకు సంబంధించి పటిష్ట బందోబస్తు, ఫ్లయింగ్ స్క్వాడ్.

ఓపెన్ స్కూల్ పరీక్షలు

మార్చి 17 సోమవారం నుంచి ఏప్రిల్ 1 వరకు పరీక్షా సమయం ఉదయం 9.30 నుండి 12.45 గంటల వరకు, 20 పరీక్షా కేంద్రాలలో 1,1 65 మంది ఓపెన్ స్కూల్ విద్యార్థులు ఫ్లయింగ్ స్క్వాడ్స్ -5. సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకొని ఒత్తిడికి లోను కాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని ఇనాచార్జి కలెక్టర్ విద్యాధరి కోరారు. జిల్లా వ్యాప్తంగా పది పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు పరీక్షా సమయం 9.30 గంటలకు అర్ధగంట ముందుగానే పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని హడావిడి లేకుండా ఒత్తిడికి లోను కాకుండా పరీక్షలు రాయాలి. జిల్లాలో ప్రశాంత వాతావరణంలో పది పరీక్షల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడం జరిగింది. దూర ప్రాంత విద్యార్థులు వారి హాల్ టికెట్‌ను బస్సులో చూపించి ఉచితంగా ప్రయాణించి సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.



ఇన్‌చార్జి కలెక్టర్ జి. విద్యాధరి

వరసిద్ధుని సేవలో పంచాయతీరాజ్ కమిషనర్

ప్రజాశక్తి- ఐరాల : రాష్ట్ర పంచాయతీరాజ్, రూరల్ డెవలప్మెంట్ కమిషనర్ కృష్ణ తేజ కుటుంబ సమేతంగా ఆదివారం శ్రీకాణిపాక వరసిద్ధి వినాయకస్వామి వారిని దర్శించుకున్నారు. వీరికి ఆయన ఈవో పెంచల కిషోర్ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేసి స్వామివారి తీర్థప్రసాదాలు శేషవస్త్రం చిత్రపటాన్ని అందజేశారు. స్థానిక సర్పంచ్ శాంతిసాగర్ రెడ్డి, దేవస్థానం మాజీ చైర్మన్ మణినాయుడు, ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, సూపరింటెండెంట్ వాసు, చిత్తూరు పంచాయతీరాజ్ అధికారి సుధాకర్, ఐరాల ఎమ్మార్వో, ఎంపీడీవో, టెంపుల్ ఇన్స్పెక్టర్ బాలాజీ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.



మోసపూరిత ఫోన్ కాల్స్ నమ్మవద్దు: కమిషనర్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మీ దుకాణానికి సంబంధించి ట్రేడ్ లైసెన్స్ బకాయిలు పెండింగ్ లో ఉంది. ఈ నెంబర్‌కు ఆన్‌లైన్లో పేమెంట్ చేయాలంటూ మున్సిపల్ అధికారులపేరుతో కొంతమంది మోసానికి పాల్పడుతున్న వైనం నగరపాలక అధికారులు దృష్టికి వచ్చింది. ఈ విషయంలో ట్రేడ్ లైసెన్స్‌దారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ట్రేడ్ లైసెన్స్ బకాయిల కోసం నగరపాలక కార్యాలయం నుండి ఎవరు ఫోన్ చేయరని, ఆన్‌లైన్లో పేమెంట్ చేయమని అడగరని ఈ విషయాన్ని లైసెన్స్ దారులు గుర్తుపెట్టుకోవాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ చెప్పారు. నగర పాలక పరిధిలోని ట్రేడ్ లైసెన్స్ దారులకు 9080329172, 7670906441 నెంబర్‌ల నుంచి ఫోన్ చేసి ట్రేడ్ లైసెన్స్ బకాయిలను ఈ నెంబర్లకు పేమెంట్ చేయాలని ఒత్తిడి చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ నెంబర్లను ఇప్పటికే పోలీసు అధికారులకు ఇవ్వడం జరిగిందని, ఇలాంటి ఫోన్ కాల్స్‌ను నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ట్రేడ్ లైసెన్స్ బకాయిలను వార్డు సచివాలయాల్లో, వార్డు పర్యావరణ పారిశుధ్య కార్యదర్శుల వద్ద, సానిటరీ ఇన్స్పెక్టర్ల వద్ద తగిన రసీదులతో చెల్లించవచ్చని, నగరపాలక కార్యాలయంలోని పురసేవ కేంద్రంలో చెల్లించవచ్చన్నారు. అంతేగాని ఫోన్‌చేసి బకాయిలు చెల్లించమంటే స్పందించవద్దని, సదరు నెంబర్లను పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. మోసపూరిత ఫోన్ కాల్స్ పై అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు.

అగ్నికి ఆహుతైన టమోటా పంట

- రూ.2 లక్షలు పంట నష్టం - ఆదుకోవాలంటున్న రైతు రెడ్డి శేఖర్

ప్రజాశక్తి- సోమల: సోమల మండలం ఇరికిపెంట పంచాయతీ మేటిమంద గ్రామానికి చెందిన రైతు రెడ్డి శేఖర్ అటవీ సమీప సరిహద్దు ప్రాంతంలోని తనకున్న కొద్దిపాటి పొలంలో టమోటా మొక్కలు నాటి వాటికి ఊతంగా కట్టెలు ఏర్పాటు చేసి పేపర్లు పరిచి సాగు చేసుకుంటూ ఉన్నాడు. శనివారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో టమోటా పంటకు నీటి తడి పెట్టి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం ఎనిమిది గంటల ప్రాంతంలో పంట వద్దకు వెళ్లి చూడగా ఎవరో గుర్తుతెలియని వ్యక్తులు అడవికి నిప్పు పెట్టడం ఆ నిప్పు రాజుకుంటూ రైతు పొలంలోని దాదాపు 100 పైపులు, లేడర్లు, టమోటా మొలకలు, కట్టెలు అగ్నికి ఆహుతాయాయని వాపోయాడు. పంట పూర్తిగా కాలిపోయి దాదాపు రెండు లక్షల మీద నష్టం వాటిలిందని అప్పులు చేసి పంట సాగు చేశానని తీరా ఇప్పుడు నష్టపోయారని ప్రభుత్వం తనను ఆదుకోవాలని ఆవేదన వ్యక్తం చేశాడు.



పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: అమరజీవి పొట్టి శ్రీరాములును ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని జిల్లా వెనుక బడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి రబ్బానీ బాష తెలిపారు. అమరజీవి పొట్టి శ్రీరాములు 125వ జయంతి వేడుకలు ఆదివారం స్థానిక జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ, సాధికారత అధికారి వారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలవేసి వేడుకలను నిర్వహించారు. సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి వాసంతి కోటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అమరజీవి పొట్టి శ్రీరాములు త్యాగనిరతి చిరస్మరణీయం: కట్టమంచి బాలకృష్ణారెడ్డి

ప్రత్యేక ఆంధ్రరాష్ట్ర స్థాపన కోసం అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగనిరతి చిరస్మరణీయమని పొట్టి శ్రీరాములు విగ్రహ స్థాపన కమిటీ ఉపాధ్యక్షులు కట్టమంచి బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక గంగినేనిచెరువు మున్సిపల్ పార్కులో పొట్టి శ్రీరాములు 104వ జయంతిని ఘనంగా నిర్వహించారు. తొలుత పార్కులోని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అమరజీవి పొట్టి శ్రీరాములు 124వ జయంతి సావినీర్ ఆవిష్కరణ మహోత్సవసభను నిర్వహించారు. విగ్రహ కమిటీ ద్వారా కార్యక్రమానికి హాజరైన అతిథులను, విరాళ దాతలను ఘనంగా సన్మానించారు. ప్రముఖ రచయిత, కుప్పం రెడ్డమ్మ సాహితి సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ రామలక్ష్మి, అతిథి చిత్తూరు మున్సిపల్ మాజీ చైర్మన్ చెంగల్రాయనాయుడు, రచయితలు ఎంఆర్ అరుణకుమారి, పార్థసారథి నాయుడు, వెంకటేష్ గుప్తా పొట్టి శ్రీరాములు సేవలను కీర్తించారు.



గంగాధర నెల్లూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఎంఈఓ ఆంజనేయులు శెట్టి, సిడిపిఓ వినత శ్రీ పూలమాల వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ అమరజీవి పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్ర సాధన కొరకు చేసిన త్యాగం మరువలేనిదన్నారు. ఇటువంటి మహనీయుని జయంతి సందర్భంగా ఆయన ఆదర్శాలను మనం అందరం అనుసరించాలని తెలిపారు.

సర్వేలతో సతమతం.. సర్వం ఒత్తిడి భరితం..

- మొరపెట్టుకున్న పంచాయతీ కార్యదర్శులు

ప్రజాశక్తి- పలమనేరు: పని ఒత్తిడి భరించ లేకపోతున్నామని, నిత్యం ఏదో ఒక సర్వే చేయాలని ప్రభుత్వం నుండి వస్తున్న ఆదేశాల మేరకు జిల్లా, మండలస్థాయి అధికారులు తమపై తీవ్రమైన ఒత్తిడి తెస్తున్నారని, అందువల్ల మానసిక ప్రశాంతత కరువై అనేకమంది అనారోగ్యాలకు గురవుతున్నామని, తమ సమస్యలు పరిష్కరించడానికి సంఘం తరపున ప్రభుత్వాన్ని తక్షణమే సంప్రదించాలని పలమనేరు నియోజక వర్గంలో పనిచేస్తున్న గ్రేడ్ 1 నుండి 5 వరకు పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శులు స్థానిక ఎన్జీఓ హోంలో ఏపీఎన్జీవో సంఘం అధ్యక్షులు ఆనందబాబుకు వినతి పత్రం అందజేశారు.

వివరాల్లోకి వెళితే.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అప్పటి వరకు సర్వేలు ఇతరత్రా పనులు చేస్తున్న వాలంటీర్లు తొలగించబడ్డారు. అయితే సహజంగానే ఆ పని భారం కాస్త సచివాలయ ఉద్యోగుల పైన పడింది. సచివాలయంలో పని చేస్తున్న చాలా కేడర్ల ఉద్యోగులు సర్వేల నుంచి వివిధ కారణాలు చూపి వారి ఉన్నతాధికారుల నుండి మినహాయింపులు పొందడంతో ఆ అదనపు పని భారం మొత్తం పంచాయతీ కార్యదర్శుల పైన పడడంతో సమస్య తీవ్రమైంది. కానీ క్షేత్ర స్థాయిలో ఉన్న సమస్యలను అర్థం చేసుకోకుండా, చెప్పినా పరిష్కరించకుండానే జిల్లాస్థాయి, డివిజన్, మండల స్థాయి అధికారులు వీరి పైన తీవమైన ఒత్తిడి తెస్తూ, మీపై చర్యలు తీసుకుంటామని బెదిరిస్తూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారని వారు వాపోయారు. సర్వేలకు కనీస గడువు కూడా ఇవ్వకపోవడం ఒకవైపు ప్రజలు ఓటీపీ చెప్పడానికి కూడా విముఖత చూపడం వల్ల వీరు రెండు వైపులా ఛీత్కారాలు ఎదుర్కొంటున్నారు.



సమావేశమైన పంచాయతీ కార్యదర్శులు

వామ్మో ఇన్ని సర్వేలా!

1.మిస్సింగ్ సిటిజన్ సర్వే, 2.మిస్సింగ్ ఎంప్లాయిస్ సర్వే, 3.వర్క్ ఫ్రం హోమ్ సర్వే 4.హౌస్‌హోల్డ్ జియో ట్యాగ్ సర్వే, 5. పి-4 సర్వే, 6. డెత్ రీ వెరిఫికేషన్ సర్వే, 7.పిఎసిఎస్ సర్వే, 8.లాథర్ ఆర్టిసన్స్ సర్వే, 9.ఎన్‌పిసిఐ లింకేజ్ సర్వే, 10. 0-6 వయస్సు ఆధార్ లేని పిల్లల సర్వే, 11. నాన్ ఏ.పి.రెసిడెంట్స్ సర్వే, 12.గ్రామ ఆస్తుల సర్వే, 13. గ్రామ ప్రొఫైల్ సర్వే,14.జనరల్ ఈకేవైసి (ఫ్యామిలీ ఈకెవైసి), 15. పిజిఆర్ఎస్ పౌరుల ఫీడ్ బ్యాక్ సర్వే. వంటి సర్వేలతో నిత్యం సతమవుతున్నమని మొరపెట్టుకున్నారు. ఇవికాక దైనందిన విధులైన తాగునీరు, పారిశుద్ధ్యం, వీధి దీపాలు, పన్ను వసూళ్లు, సమావేశాల నిర్వహణ, హాజరు, తదితర అనేక విధులు పంచాయతీ కార్యదర్శులు నిర్వహించాల్సి ఉంది. సమస్యను జిల్లా ఎన్జీఓ సంఘం ద్వారా రాష్ట్ర నాయకత్వానికి తెలియజేసి ప్రభుత్వానికి నివేదించటానికి తప్పక కృషి చేస్తామని సమావేశంలో పాల్గొన్న ఎన్జీఓ సంఘం అధ్యక్షులు ఆనందబాబు, జిల్లా ఉపాధ్యక్షులు లక్ష్మీపతి యాదవ్ తెలిపారు. పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఈ సమస్యపై సమీక్ష జరపాలని తగు పరిష్కారం చూపాలని వారు డిమాండ్ చేశారు. సుధాకర్ రావు, మోహన్ రాంప్రసాద్, హరి, సురేష్, మహబూబ్ బాషా, రెడ్డిప్రకాష్‌రెడ్డి, వెంకటరమణ, రాకేష్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యలపై ప్రజా చైతన్య యాత్ర



ప్రశాంత్‌నగర్‌లో సమస్యలు తెలుసుకుంటున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: సిపిఎం ఆధ్వర్యంలో ఆదివారం ప్రజా చైతన్య యాత్ర చిత్తూరు నగరంలో న్యూ ప్రశాంత్ నగర్ కాలనీలో ప్రారంభమై వైయస్సార్ కాలనీ వరకు తిరగడం జరిగింది. ఈ కాలనీ నుండి ప్రజలు అనేక రకాల సమస్యలను సిపిఎం నాయకుల దృష్టికి తీసుకువచ్చారు. జిల్లా కమిటీ సభ్యులు కాంచీవరం సురేంద్రన్ మాట్లాడుతూ న్యూ ప్రశాంత్ నగర్ కాలనీ సమస్యలు అనేకం ఉన్నాయని వాటిలో ప్రధానంగా డ్రైనేజీ కాలువలు లేవని, శ్మశాన భూమి లేదని, బస్సు సౌకర్యం లేదని, హెల్త్ క్లినిక్ ఓపెన్ చేయాలి ఇలా అనేక రకాల సమస్యలను ప్రజలు తమ దృష్టికి తీసుకొచ్చారని ఈ సమస్యల పరిష్కారం కోసం సిపిఎం ఆధ్వర్యంలో అధికారులకు అర్జీలు అందజేస్తామని, పరిష్కారం కాకుంటే ఉద్యమాలు చేస్తామని ఆయన తెలిపారు. పార్టీ సభ్యురాలు చిట్టెమ్మ మాట్లాడుతూ ఈ కాలనీకి తాగునీరు ఐదు రోజులకు ఒకసారి వస్తుందని, వాటర్ ట్యాంకు నిర్మించాలని, మహిళలకు స్వయం ఉపాధి పనులు కల్పించాలని, వేలాదిమంది పేదల నివసిస్తున్న కాలనీలకు బస్సు సౌకర్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. ప్రియా, కళ, రాధమ్మ, గీతమ్మ, వెంకటేశు, అల్లా భాష, రాజు, అమ్ములు, పర్వీను, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

చిత్తూరులో జయసిల్క్స్ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: నగరంలోని ఎంఎస్ఆర్ సినిమా థియేటర్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన జయసిల్క్స్ షోరూంను ఆదివారం ఉదయం చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీకే బాబు మాట్లాడుతూ చిత్తూరు ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన వస్త్రాలను అందించేలా జయ సిల్క్స్ షోరూంను ఏర్పాటు చేయడం శుభ పరిణామమన్నారు. అనంతరం షో రూమ్ నిర్వాహకులు భాగ్యరాజ్, జయరాజ్‌లను ఆయన అభినందించారు. షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ చిత్తూరు నగరం పరిసర ప్రాంతాలకు చెందిన కస్టమర్ల దృష్టిలో ఉంచుకొని వస్త్ర దుకాణాన్ని ఏర్పాటు చేశామన్నారు. దాదాపు 200 కిలోమీటర్ల పైగా దూరంలో ఉన్న బెంగళూరు, చెన్నైలాంటి మహానగరాలకు వెళ్లే పని లేకుండా చిత్తూరు నగరంలో ఐదు అంతస్తుల అత్యాధునిక భవనంలో పురుషులు, మహిళలు, చిన్నపిల్లలకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన వస్త్రాలను కస్టమర్లకు అందుబాటులో ఉంచామన్నారు. కస్టమర్లు అందుబాటు ధరలో నాణ్యత కలిగిన వస్త్రాలను కొనుగోలు చేసి తమను ఆదరించాలని నిర్వాహకులు కోరారు. చుడ చైర్‌పర్సన్ కటారి హేమలత, ఎమ్మెల్యే తండ్రి, జిజేఎం చారిటబుల్ ట్రస్ట్ డైరెక్టర్ గురజాల చెన్నకేశవులు నాయుడు పాల్గొన్నారు.

పంటలపై ఒంటరి ఏనుగు దాడి

ప్రజాశక్తి- రొంపిచర్ల: పులిచెర్ల మండలం పాతపేట పంచాయతీ పాలెం గ్రామరైతులకు చెందిన వ్యవసాయ పంటలను ఆదివారం తెల్లవారుజామున ఒంటరి ఏనుగు నాశనం చేసింది. ఎద్దులవారిపల్లి రైతుకు చెందిన మామిడి చెట్లను విరిచేసింది. పాలెం గ్రామంలోని పంట పొలాల్లోకి వెళ్లి విద్యుత్ స్తంభం, వ్యవసాయ మోటారు పైపులను ధ్వంసం చేసింది. తరచూ ఇలా ఏనుగులు పంటలు నాశనం చేయడం వల్ల ఎంతో నష్టపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.



23న పైనేని మునెమ్మ స్మారక పురస్కారాల ప్రదానం



ప్రజాశక్తి -గంగవరం: ఈనెల 23వ తేదీ ఆదివారం శ్రీరంగరాజపురం మండలం ఆరిమాకులపల్లిలోని తెలుగు తల్లి కళాప్రాంగణంలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలను ప్రదానం చేయనున్నట్లు గంగవరం పంచాయతీ సాయి గార్డెన్ సిటీలోని తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షులు పైనేని తులసీ నాథం నాయుడు తెలిపారు. ఇటీవలే ప్రకటించిన విధంగా కథల పోటీలలో గెలుపొందిన వివిధ రాష్ట్రాలకు చెందిన వారికి నగదు పురస్కారాలు అందించడంతో పాటు ఘనంగా సత్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విశ్వశ్రీ సాహితీ సమాఖ్య అధ్యక్షులు డాక్టర్ దామోదర్ నాయుడు, శతావధాని ఆముదాల మురళి, డాక్టర్ శ్రీమన్నారాయణ, ఆత్మీయ అతిథులుగా జొన్న విత్తుల శ్రీరామచంద్రమూర్తి, ఆనందబాబు, జెడికె ధనంజయ, తదితరులు పాల్గొంటారన్నారు. తెలుగు భాష, సాహిత్య అభిమానులు అందరూ విచ్చేసి కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని కోరారు.

విరాళాల వెల్లువ


ఆలయానికి విరాళాలు అందిస్తున్న దాతలు

ప్రజాశక్తి- సోమల: మండల కేంద్రమైన సోమల స్వయంభీశ్వర స్వామి ఆలయానికి అనుబంధంగా నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి విరాళాలు వస్తున్నాయి. దొంగరి అక్కులమ్మ వెంకటప్ప దంపతులు గ్రానైట్ పనులకు ఒక లక్ష రూపాయలు, 50 సిమెంట్ బస్తాలు, సుబ్రహ్మణ్యం శెట్టి వరదం మంజుల దంపతులు 25వేల రూపాయలు, సింగంశెట్టి లక్ష్మమ్మ సిద్దప్ప రూ. 20 వేలు అందించారు. చిన్నిరి గారి కన్నయ్య రూ.12 వేలు, శెట్టి వారి చంద్రశేఖరరెడ్డి జ్ఞాపకార్థం కుమారుడు సుధాకర్ రూ.11 వేలు, కంచర్ల యుగంధర్ పదివేల116 రూపాయలు, డాక్టర్ కృష్ణమూర్తి రూ.5,116, కోదూరు లక్ష్మీనారాయణ శాస్త్రి కుమారుడు రామ్మూర్తి రూ. ఐదువేలు, గన్నా చంద్రయ్య రూ 5వేలు విరాళంగా ధర్మకర్త బిని సోమశేఖర్కు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

జెడ్పిటిసిని పరామర్శించిన మాజీ డిప్యూటీ సీఎం


జెడ్పిటిసిని పరామర్శిస్తున్న నారాయణస్వామి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం: ఎస్ఆర్పురం వైసిపి జెడ్పిటిసి, సీనియర్ నాయకుడు ఆ పార్టీలో క్రియా శీలకంగా వ్యవహ రించిన రమణ ప్రసాద్ రెడ్డి అనారోగ్యానికి గురయ్యారు. విషయం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం కళత్తూరు నారాయణస్వామి ఆదివారం మంగుంట గ్రామం బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మాట్లాడుతూ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ మండలంలో పార్టీ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న జెడ్పిటిసి రమణ ప్రసాద్ రెడ్డి అనారోగ్యానికి గురి కావడం పార్టీకి తీరని లోటు అని త్వరగా కోలుకోవాలని మెరుగైన చికిత్స అందిస్తామని బాధితుడు కుటుంబానికి భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమానికి మండల కన్వీనర్ మణి, అనంతరెడ్డి, మాజీ జెడ్పిటిసి గురవారెడ్డి, నాయకులు కుప్పయ్య, జనార్దన్, కబీక పల్లి మణి, చిట్టి మహేష్, కోటిరెడ్డి బాబు, కొత్తపల్లి సాము, సర్పంచులు ఎంపీటీసీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



రేపటి నుండి గంగ జాతర

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలం కొలమాసనపల్లి పంచాయతీ కల్లాడు గ్రామంలో ఈనెల 18,19,20 వతేదీల్లో గంగ జాతరను ఘనంగా నిర్వహిస్తామని ఆలయధర్మకర్త జె అమరనాథరెడ్డి,, తొమ్మిది గ్రామాలకు చెందిన గ్రామ పెద్దలు తెలిపారు. గంగ జాతర చాటింపు పెట్టిన రోజు నుంచి చుట్టుపక్కల ఉన్న తొమ్మిది గ్రామాల ప్రజలు ప్రతిరోజూ పూజలు నిర్వహించి అన్నదానం నిర్వహించి వీధి నాటకం, పండరి భజనలు, కోలాటలు, హరికథలు జరిపారని తెలిపారు. ఈనెల 18వ తేదీ మంగళవారం రాత్రి శిరస్సు,19 వ తేదీ బుధవారం జాతర,20 వ తేదీ గురువారం జలది కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. మండలంలోని ప్రజలందరూ ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని గ్రామస్తులు తెలిపారు.

11 సీట్లకు పరిమితం చేసినా మార్పులేదు

టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: వైసిపి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో జరిగిన అరాచకాలకు హత్యలకు, కక్ష సాధింపు చర్యలకు, దోపిడీకి వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు తీర్పునిచ్చి ఆ పార్టీకి 151 సీట్లు నుండి 11 సీట్లకు పరిమితం చేసిన వారిలో మార్పు రాలేదని వారి తీరు మారలేదని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సురేంద్ర కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారం పోయిన తర్వాత కూడా రాష్ట్రంలో రాజకీయ హత్యలు కొనసాగిస్తూనే ఉన్నాయన్నారు. పుంగనూరు నియోజకవర్గం కృష్ణాపురంలో జరిగిన టిడిపి కార్యకర్త రామకృష్ణ హత్య ముమ్మాటికి రాజకీయ హత్యే అని అన్నారు. రామకృష్ణ టిడిపిలో స్థానికంగా క్రియాశీలక నాయకుడుగా పనిచేసేవాడని, గత ఐదేళ్ల వైసిపి పాలనలో జరిగిన అరాచకాలను ఎండగడుతూ వచ్చారని, ఆ కక్షతో టిడిపి నాయకుడు రామకృష్ణను హత్య చేసిన వెంకటరమణను కఠినంగా శిక్షించాలని కోరారు.


రైతులకు అవగాహన కల్పిస్తున్న రైతు సేవా కేంద్రాల సిబ్బంది

స్మార్ట్ ఫోన్ వినియోగంపై అవగాహన

ప్రజాశక్తి - వెదురుకుప్పం: మండలంలోని రైతులకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు వారి స్మార్ట్ ఫోన్ ఉపయోగించే విధానం గురించి, వారి ఫోన్లో వున్న వివిధ రకాల యాప్ల గురించి వాటిని ఉపయోగించే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రైతులు వారి స్మార్ట్ ఫోన్ల ద్వారా ఎప్పటికప్పుడు మార్కెట్ ధరలు తెలుసు కోవడం, ఎన్పిఎస్ఎస్ యాప్ ద్వారా పంటల పీడ పీడలను గుర్తించడం, వాటి నివారణ చర్యలు తెలుసు కోవచ్చన్నారు. ఇతర ప్రభుత్వ యాప్లు ఎలా ఉపయోగించాలి? అనే అంశంపై సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాట్ సెంటర్ లక్ష్మీ ప్రసన్న ఏవో, ట్రైనర్ నదీమ్, వ్యవసాయ అధికారి వనిత, రైతు సేవా కేంద్రాల సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.


నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న ఖిద్మాత్ ఈ ఖల్క్ యూత్ కమిటీ

నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి -సోమల: సోమల మండలం నంజంపేట గ్రామానికి చెందిన ఖిద్మాత్ ఈ ఖల్క్ యూత్ కమిటీ ఆధ్వర్యంలో రంజాన్ పండుగ మాసాన్ని పురస్కరించుకొని గ్రామంలోని 45 నిరుపేద కుటుంబాలకు 15 రకాల నిత్యావసర సరుకులను ఆదివారం పంపిణీ చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ప్రతినెల 15 నిరుపేద కుటుంబాల వారికి నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్నామని రంజాన్ మాసం సందర్భంగా మరింత మందికి నిరుపేదలకు సాయం అందించాలని ఉద్దేశంతో 45 కుటుంబాలకు పంపిణీ చేశామని తెలిపారు. కార్యక్రమం లో యూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.


నియామక పత్రం అందుకుంటున్న అయూబ్ బాషా

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా అయూబ్ బాషా

ప్రజాశక్తి-పుంగనూరు: పుంగనూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎస్ ఆయుబ్ భాషను నియ మిస్తూ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు గాజుల భాస్కర్ నియామక పత్రాన్ని ఆదివారం అందజేసినట్లు ఆయన ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ, అన్నమయ్య జిల్లా, రాయచోటి కాంగ్రెస్ కార్యాలయంలో నియామక పత్రాన్ని డిసిసి అధ్యక్షుడు అందించారని తెలిపారు. అధ్యక్షుడిగా నియమించిన కాంగ్రెస్ అధిష్టానం ఏపీసీసీ అధ్యక్షులు షర్మిలమ్మ, డీసీసీ అధ్యక్షులు గాజుల భాస్కర్ తనకు సహకరించిన పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్ఛార్జ్ డాక్టర్ యన్ మురళి మోహన్ యాదవ్ పుంగనూరు నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులకు, పట్టణ కాంగ్రెస్ నాయకులు కార్యకర్త లకు కృతజ్ఞతలు తెలిపారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ ని బలోపేతం చేసుందుకు తనవంతు కృషి చేస్తానన్నారు.

హత్య దురదృష్టకరం: సజ్జద్ బాషా

ప్రజాశక్తి -పుంగనూరు: పుంగనూరు మండలం కృష్ణాపురంలో టిడిపి నాయకుల్ని వైసీపీకి చెందిన రౌడీలు హత్య చేయడం దురదృష్టకరమైన సంఘటన అని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు జిల్లా ప్రియాంక సేవాదళ్ అధ్యక్షుడు ఎస్ సజ్జద్ బాష ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. టిడిపి కార్యకర్త హత్యకు గురి కావడం చాలా దురదృష్టకర మని, మనస్పర్థలతో వైసిపి అభిమాని టిడిపి కార్యకర్తను చంపేయడాన్ని ఖండిస్తున్నట్లు చెప్పారు. పుంగనూరులో ఇలాంటివి జరగకుండా పోలీసులు కఠినంగా వ్యవహరించాలన్నారు. అన్ని పార్టీల కార్యకర్తలు సోదర భావంతో మెలగాలని, వ్యక్తిగత కక్షలు మానుకోవాలని సూచించారు. మృతుడి కుటుంబాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

బకాయి పడ్డ పిఎఫ్, ఇఎస్ఐ డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి-కుప్పం టౌన్ : కుప్పం ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కార్మికుల కష్టాలను తీర్చాలని, వారికి బకాయి పడ్డ పిఎఫ్, ఇఎస్ఐ లను వెంటనే చెల్లించాలని, కార్మికుల కొరతను భర్తీ చేయాలని ఏపీ మెడికల్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి చంద్ర డిమాండ్ చేశారు. ఆదివారం కుప్పం పట్టణంలో ప్రభుత్వ ఆసుపత్రి అవుట్సోర్సింగ్ సిబ్బంది, సెక్యూరిటీ గార్డ్స్, చెద పురుగుల నివారణ కార్మికులు నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పెండింగ్ పిఎఫ్, ఇఎస్ఐలను సైతం ఏజెన్సీ వారు చెల్లించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంటనే చెల్లించాలని కోరారు. ఈ సమావేశంలో భాగంగా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ఏపీ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే వెంకటేష్, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ మెంబర్ చంద్రశేఖర్, కార్మికులు పలని, రామదాసు పాల్గొన్నారు.

తీరు మారని అధికారులు!

- పట్టని ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు - కాలిపోయి నెల గడుస్తున్నా స్పందించని వైనం
- కళ్లెదుటే ఎండుతున్న పంట - ఆగని రైతు ఆవేదన



ప్రజాశక్తి- వెదురుకుప్పం: మండలంలోని మాంబేడులోని పి నాగరాజు రెడ్డికి చెందిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయి నెల గడుస్తున్నా విద్యుత్ అధికారు లు స్పందించలేదు.. దీంతో నీళ్ల అందక కళ్ల ఎదుటే పశుగ్రాసం పంట ఎండిపో తోందని రైతు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. విద్యుత్ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా స్పందించడం లేదని వాపో తున్నాడు.. గతంలో పచ్చికాలపలంకు చెందిన కేశవులురెడ్డికి చెందిన ట్రాన్స్ ఫార్మర్ కాలిపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. మండలంలో ఇవి కొన్ని ఉదాహరణలు మాత్రమే.. మండలంలో మరెందరో రైతులు ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఇది అద్దం పడుతోంది..ఇకనైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని రైతులు కోరుతున్నారు..

ప్రజాశక్తి -వెదురుకుప్పం : గంగాధర నెల్లూరు నియోజకవర్గం పరిధిలో వెదురుకుప్పం మండలం మాంబేడు గ్రామంలో పి నాగరాజు రెడ్డి రైతు పంట పొలంలో వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్ ఫిబ్రవరిలో కాలిపోయింది. అప్పుడే పంచాయతీ విద్యుత్ అధికారులు వచ్చి పరిశీలించి నిర్ధారించారు. అప్పటి నుంచి ఈ రోజు వరకు కార్యాలయం చుట్టూ రైతు ప్రదక్షిణ చేస్తు న్నాడు. అయినా అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. ఇది విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని స్థానికులు విమర్శలు గుప్పిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారు లు స్పందించి రైతుకు న్యాయం చేయాలని కోరుతున్నారు.


నీరు అందని పశుగ్రాసం పైరు

చెప్పిన పట్టించుకోలేదు..



మా చేనులో ఉన్న వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయిందని . ఏఇకి చెప్పినాను. సార్ ఆవులకు వేసే కసువు మొక్క ఎండిపోతుందని ప్రాధేయ పడ్డాను. రేపు వచ్చి బిగిస్తారు.. ట్రాన్స్ ఫార్మర్లు ఇంకా రాలేదని చెప్పారు. నెల రోజులు పైనే గడుస్తోంది.. స్పందించలేదు. కసువు మొక్క పూర్తిగా ఎండిపోయింది. పాడి ఆవులకు ఆహారం ఏమి చేయాలో అర్థం కావడం లేదు. జరగాల్సిన నష్టం జరిగిపోయింది. మరొక రైతుకి ఈ పరిస్థితి తలెత్తకుండా చూడాలి..

- పి నాగరాజు రెడ్డి, రైతు మాంబేడు గ్రామం, వెదురు కుప్పం మండలం.

పెత్తనం కోసమే రామకృష్ణ హత్య?

- నెల రోజుల క్రితమే హత్యకు ప్రణాళిక
- వేట కొడవలి అందించింది రజిని
- ప్రత్యేక బలగాలతో కేసు దర్యాప్తు : డిఎస్పి

ప్రజాశక్తి -పుంగనూరు: ఆ గ్రామంలో ఆర్థికంగా, వ్యవసాయపరంగా వైసీపీకి చెందిన చెందిన కుటుంబాల కన్నా టిడిపికి చెందిన రామకృష్ణ కుటుంబం బాగా ఉండడం టిడిపి అధికారంలో ఉండడంతో గ్రామంలో పట్టు కోల్పోతామని వైసిపికి చెందిన కొందరు నెల క్రితమే ప్రణాళికలు వేసి కాగతి వెంకటరమణను ఉసికొలిపి హత్య చేయించారు. చంద్రమాకులపల్లి పంచాయతీ కృష్ణాపురం వైసిపికి చెందిన కే వెంకటరమణ, రెడ్డప్పరెడ్డి, రజిని, త్రిలోక్‌లు ఆ గ్రామంలో మనకు అన్నింటికీ అడ్డు తగులుతున్నారని ఎలాగో ఒకలా శాశ్వతంగా అడ్డు లేకుండా చేసుకోవాలని ప్రణాళికలు వేసి హత్య చేయించారని గ్రామంలో ప్రధానంగా చర్చించుకుంటున్నారు. వేట కొడవలిని కూడా రజిని అందించిందని అతని రెచ్చగొట్టి ఉసిగొల్పి హత్య చేయాలని ప్రేరేపించి పంపడంతో మద్యం మత్తులో బరితెగించి హత్య చేసేందుకు తెగబడ్డాడు. హత్య జరిగిన వెంటనే వైసీపీకి చెందిన వారందరూ ఇళ్లకు తాళాలు వేసి పరారు అయ్యారు.

కృష్ణాపురాన్ని సందర్శించిన టిడిపి నేతలు

రామకృష్ణ హత్య అనంతరం ఆదివారం మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్ బాషా, పుంగనూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చల్లా రామచంద్రారెడ్డి కృష్ణాపురం గ్రామం చేరుకుని మృతుని కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని వారికి భరోసా ఇస్తూ కుటుంబాన్ని ఓదార్చారు.

పల్లా పరామర్శ

శనివారం హత్యకు గురైన రామకృష్ణ కుటుంబానికి పార్టీ అండగా ఉంటోం దని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మృతుడి బంధువులు నిందితులను అరెస్టు చేసి తమ ముందు ఉంచితేనే అంత్యక్రియలు చేస్తామని, భవిష్యత్తులో నిందితులు బెయిల్ పై వచ్చి తమ కుటుంబం పై దాడికి పాల్పడితే తమ పరిస్థితి ఏమిటని అధికారులను, పార్టీ నాయకులను ప్రశ్నించారు. దీంతో వారు బాధిత కుటుంబంతో మాట్లాడుతూ పోలీసులు తీసుకొనే చర్యలు వివరించారు. పార్టీ అధిష్టానం తీసుకొనే నిర్ణయాలు తెలిపారు. దీంతో వారు శాంతించి అంత్యక్రియలకు ఉపక్రమించారు. మృత దేహంపై కండువా కప్పి నివాళులు అర్పించారు.


నివాళులర్పిస్తున్న నాయకులు

కృష్ణాపురంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు

కఠిన శిక్షలు ఉంటాయి: డి.ఎస్.పి

రామకృష్ణ హత్య కేసులో నిందితులు లందరికీ కఠిన శిక్షలు ఉంటాయని పలమనేరు డిఎస్పి ప్రభాకర్ రెడ్డి తెలిపారు. కృష్ణాపురం గ్రామాన్ని సందర్శించిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ రామకృష్ణ హత్య కేసు దర్యాప్తుకు ప్రత్యేక బలగాలు పని చేస్తున్నాయని, త్వరలో నిందితులందరినీ పట్టుకుంటామని, సీసీ టీవీ పుటేజులు, సెల్ ఫోన్ లో ఎవరు ఎవరితో మాట్లాడారు? అనే విషయాలు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నట్లు తెలిపారు. చనిపోయిన కుటుంబానికి పోలీసులు ఎప్పుడు అండగా ఉంటారని వారికి పూర్తి స్థాయిలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విశ్వకర్మ కార్పెంటర్లను ఆదుకోవాలి

- అధ్యక్షుడు గురునాథం

ప్రజాశక్తి చిత్తూరు అర్బన్ : అరకొర ఆదాయాలతో అభివృద్ధికి నోచుకోని విశ్వకర్మ కార్పెంటర్లను ప్రభుత్వం అన్ని రకాల ఆదుకోవాలని చిత్తూరు విశ్వకర్మ కార్పెంటర్ల సంఘం అధ్యక్షులు ఆర్ గురునాథం కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక టీటీడీ కల్యాణ మండపంలో చిత్తూరు విశ్వకర్మ కార్పెంటర్ల సంఘ సమావేశం ఆ సంఘం ప్రధాన కార్యదర్శి జి జయకుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గురునాథం మాట్లాడుంజూ.. ప్రస్తుతం రెడీమేడ్ ఫర్నిచర్ పెద్ద ఎత్తున రంగప్రవేశం చేయడంతో తమలాంటి కార్పెంటర్లకు పని లేకుండా పోతోందన్నారు. దీన్ని నివారించేందుకు ప్రభుత్వం అన్ని రకాల కృషి చేయాలన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి జయకుమార్ మాట్లాడుతూ.. చిత్తూరు నగరంలో చేతి వృత్తినే నమ్ముకున్న ప్రతి కార్పెంటర్ ఆర్థిక ఇబ్బందులతో కొట్టుమిట్టాడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో పొట్టకూటి కోసం కుటుంబ సభ్యులతో కలిసి తమిళనాడు, కర్ణాటక లాంటి సరిహద్దు రాష్ట్రాలకు వలస పోవాల్సి వస్తోందన్నారు. దీన్ని నివారించాలంటే ప్రభుత్వం తమకు అన్ని రకాల సహాయ, సహకారాలు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా ఉచితంగా పనిముట్లు పంపిణీ, సబ్సిడీపై యంత్రాల కొనుగోలుకు ఆర్థిక సహాయం, తమ కార్పెంటర్ దుణాలకు విద్యుత్ చార్జీల్లో రాయితీ ఇవ్వడంతో పాటు కార్పెంటర్లందరికీ ఒకే చోట ఇళ్ల స్థలాలను కేటాయించి కార్పెంటర్ కాలనీ ఏర్పాటు, విశ్వకర్మ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రత్యేక రుణాలను మంజూరు చేయడం తదితర పథకాలను అమలు చేయాలని కోరారు. కాగా ఈ సమావేశంలో సంఘం కోశాధికారి ఎం షణ్ముగం, ఉపాధ్యక్షులు పుణ్యకోటి, విజయ్ ఆచారి, కార్యదర్శి సంజీవి, కార్యవర్గ సభ్యులు ఆనందన్, కార్తవరాయన్, బాబు, సెల్వకుమార్, కుమరేషన్, చిన్న, బాలాజీ, నాగరాజఆచారి, గోపి, తేజ, కామేశ్వర్ ఆచారితో పాటు పెద్ద ఎత్తున విశ్వకర్మ కార్పెంటర్లు పాల్గొన్నారు.

విఎస్‌టి ట్రాక్టర్ షోరూమ్ ప్రారంభం

ప్రజాశక్తి- శాంతిపురం: మండల కేంద్రంలోని ఇవిఎంఆర్ కాంప్లెక్స్‌లో శ్రీ వినాయక ట్రేడర్స్ వారు నూతన వి ఎస్ టి ట్రాక్టర్ షోరూమ్‌ను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి గుంజార్ల పల్లె సర్పంచ్ విజయ రామిరెడ్డి, విఎస్‌టి ట్రాక్టర్ల సేల్స్ హెడ్ ఇ ప్రభు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిం చారు. ఈ సందర్భంగా షోరూం నిర్వాహకులు మాట్లాడుతూ తమ వద్ద వ్యవసాయ అవసరాలకు సంబంధించిన అన్ని రకాల ట్రాక్టర్లు అందుబాటులో ఉంటా యన్నారు. తమ షోరూంలో తమ కంపెనీకి సంబంధించిన ట్రాక్టర్లకు సర్వీసు సేల్స్ సదుపాయాలు ఉంటాయన్నారు. రైతు సోదరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసు కోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీ వినాయక ట్రేడర్స్ యజమానులు మంజునాథ, ఉదయ్ కుమార్, వైస్ ఎంపీపీ ఉదయ్ కుమార్, మండల టిడిపి ప్రధాన కార్యదర్శి నాగరాజు, మాజీ సర్పంచ్ ఆంజనేయ రెడ్డి, నాయకులు ఆర్ఎస్ మనీ, గోవిందరాజులు, రైతు ఉమాశంకర్ రెడ్డి, పలువురు మండల రైతులు పాల్గొన్నారు.


ట్రాక్టర్‌ను పరిశీలిస్తున్న దృశ్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఇ. ప్రభు

క్రైం న్యూస్



ఇసుక లారీలు సీజ్

ప్రజాశక్తి -గుడిపాల: ఇసుక లారీలను సీజ్ చేసినట్లు గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు ఆదివారం పల్లూర్ వద్ద తనిఖీలు చేస్తుండగా నెల్లూరు నుండి తమిళనాడుకు వెళుతున్న ఏపీ 39 యువి 1117, ఏపీ 16 టీఈ 5119, ఏపీ 39 విఎఫ్ 7789 నెంబర్లు వున్న 3 ఇసుక లారీను సీజ్ చేసి కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు. సోమవారం గుడిపాల తహశీలారుకి మూడు లారీలను అప్పగిస్తునట్లు ఎస్ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-చౌడేపల్లి: రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై నాగేశ్వరరావు కథనం మేరకు... మదనపల్లి ఎన్వీఆర్ లేఅవుట్ కు చెందిన ఉపాధ్యాయుడు వెంకటరమణ చౌడేపల్లికి తన సమీప బంధువు గృహప్రవేశానికి వచ్చి తిరిగి వెళుతుండగా బోయకొండ మదనపల్లి ప్రధాన రహదారిలో పక్షిరాజుపురం రెండవ ఘాటు వద్ద తాను ప్రయాణిస్తున్న టూవీలర్ అదుపు తప్పి కిందికి పడిపోయింది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కావడంతో 108 సాయంతో మదనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వెంకటరమణ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.


పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

పరిసరాల పరిశుభ్రత అవసరం

ప్రజాశక్తి - వెదురుకుప్పం: పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని వెదురుకుప్పం దేవర గుడిపల్లి పంచాయతీ సర్పంచ్ ఆశీర్వాదం, దేవరగుడిపల్లి టిడిపి గ్రామ కమిటీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు , టిడిపి మండల క్రిస్టియన్ సెల్ అధ్యక్షులు చొక్కా మహేష్ పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర– స్వర్ణాంధ్రలో భాగంగా వారు దేవరగుడి పల్లిలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది ఇంజనీరింగ్ అసిస్టెంట్ గిరిధర్, వీఆర్వో వెంకట సాంబయ్య, డిజిటల్ అసిస్టెంట్ నిత్య, ఆశ వర్కర్లు, ఎంపీపీ పాఠశాల టీచర్లు శ్రీనివాసులు పారిశుధ్యం అవగాహన కల్పించారు.



విద్యా సామగ్రి పంపిణీ చేస్తున్న దాతలు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి- బైరెడ్డిపల్లి : మండలంలోని మహతి ఫౌండేషన్ ఛైర్మన్ నాగరాజు గారు సహకారంతో టెన్త్ క్లాస్ విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల పరిధిలోని కమ్మనపల్లి పంచాయతీలో ఉన్న ఆంధ్రప్రదేశ్ గురుకుల పాఠశాల కమ్మనపల్లిలో టెన్త్ క్లాస్ చదువుతున్న 81 మంది విద్యార్థులకు నేడు రాయనున్న టెన్త్ క్లాస్ పబ్లిక్ ఎగ్జామినేషన్ సందర్భంగా ఆదివారం సాయంత్రం ప్రిన్సిపల్ శోభ అధ్యక్షతన పాఠశాలలో పదో తరగతి విద్యార్థినిలకు మహతి ఫౌండేషన్ ఛైర్మన్ మేనేజర్ నాగరాజు సహకారంతో విద్యా సామగ్రిని అందించారు. అనంతరం విద్యార్థులతో మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు స్వతంత్ర పోరాటంలో చేసిన పోరాటాలపై స్వల్ప సమయంలో గుర్తు చేశారు. విద్యార్థులు టెన్త్ క్లాసులో జిల్లాస్థాయిలోనే మొట్టమొదటి స్థానం వచ్చేలా టెన్త్ క్లాస్ ఎగ్జామ్ రాసి విద్యార్థులకు తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని కోరారు. అంతేకాకుండా జీవితంలోనే మొదటి ఎగ్జామ్ కావడంతో విద్యార్థులు గుర్తించుకొని అధిక మార్కులు సంపాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మహతి ఫౌండేషన్ సహాయక మేనేజర్ శ్రీనివాసులు, శాంతమ్మ, బుజ్జి, శోభ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేటి నుండి పది పరీక్షలు

ప్రజాశక్తి- తవణంపల్లి: ఎమ్మార్వో సుధాకర్, ఎస్ఐ చిరంజీవి ఆదేశాల మేరకు 17వ తేదీ ఉదయం నుండి ఒకటవ తేదీ వరకు పదో తరగతి పరీక్షలు జరుగుతున్నందున తవణంపల్లి మండలంలో పరీక్ష కేంద్రాల వద్ద బిఎన్ఎస్ ఎస్ ఆదేశాల మేరకు 200 మీటర్ల పరిధిలో ఉదయం ఎనిమిది గంటల నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగే రోజుల్లో జిరాక్స్ సెంటర్లను మూసివేయాలని ఆ ప్రాంతంలో ముగ్గురు లేదా అంతకంటే ఎక్కువ మంది వ్యక్తులను ఉండకూడదని, గుమికూడి ఉండకూడదని చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వాల్టా చట్టానికి తూట్లు..

- అక్రమంగా చింత చెట్లు నరికివేత..
- ఎస్ఐకి, విఆర్ఓకు ఫిర్యాదు

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం : చెట్లను పోషించడం, నరికివేతను అడ్డుకోవడం , పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంచడం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన వాల్టా చట్టానికి ఎస్ ఆర్ పురం లో తూట్లు పడుతున్నాయి. గత కొంతకాలంగా చెట్లను నరికి కొందరు సమీపంలోని తమిళనాడుకు తరలిస్తున్నారు. అటు ఫారెస్ట్ అధికారులు, సంబంధిత అధికారులు దీన్ని పట్టించు కోకపోవడం గమనార్హం. అయితే శనివారం మండలంలోని సీకేపురం పెద్ద చెరువు కట్టపై ఉన్న చింత చెట్లను కొందరు అక్రమంగా నరికివేశారు. దీనిపై గ్రామంలోని పెద్దలు, బిజెపి నాయకులు స్పందించడంతో ఈ సమస్య వెలుగులోకి వచ్చింది. ఇదే క్రమంలో చెట్లకు సంబంధించిన కొన్ని ఫొటోలు బయట రావడంతో తహశీల్దారు లోకనాథ పిళ్లై స్పందించి వీఆర్వోని ఆదేశించారు. వీఆర్వో చెట్లు అక్రమంగా తరలించే వారి పేర్లను వీరిని అడ్డుకోవాలంటూ ఎస్ఆర్ పురం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు ఒక లేఖను విడుదల చేశారు. దీంతో వాల్టా చట్టాన్ని కాపాడాల్సిన బాధ్యత ఎస్ఆర్ పురం పోలీసులు పై పడింది. యథేచ్ఛగా అక్రమంగా తరలిస్తున్న ఇకనైనా అడ్డుకుంటారా అనే విషయంపై గ్రామాల్లో చర్చ ప్రారంభమైంది. ముఖ్యంగా చింత చెట్టు లాంటి ప్రజలకు నిత్యవసరంగా ఉపయోగపడే చెట్లను కూడా అక్రమంగా నరికివేస్తున్నారు. ఇందుకు ప్రభుత్వ సెలవు దినాలను ఎంచుకొని మరీ చెట్లను కోయడం అక్రమదారులకు పరిపాటిగా మారింది. గతంలో ఎన్నడూ లేనివిధంగా వీఆర్వో పోలీసులకు ఫిర్యాదు చేయడం గమనించదగ్గ విషయం.



దీనిపై ఎస్ఆర్ పురం ఎస్ఐని వివరణ కోరగా వీఆర్వో ఫిర్యాదు మేరకు విచారించి కేసు నమోదు చేస్తామని ఎస్ఐ సుమన్ తెలిపారు.

వైసిపి ప్రభుత్వంలోనే గ్రామాల అభివృద్ధి: ఎంపిపి

ప్రజాశక్తి -కార్వేటినగరం: వైసిపి ప్రభుత్వ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి బాట పట్టిందని ఎంపీపీ లత బాలాజీ అన్నారు. మండల కేంద్రంలో మూర్తిరాజు వీధిలో రూ. 5లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను సర్పంచ్ ధనంజవర్మతో కలసి ఆదివారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారంలో ఉన్నప్పుడే అభివృద్ధి పనులు సాగాయన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి కార్వేటినగరాన్ని దత్తతకు తీసుకుని మరింత అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర అంటూ చెత్తను తొలగించి రాష్ట్రం అభివృద్ధి చెందుతోందని సీఎం చంద్ర బాబు ఊదరగొడుతున్నారన్నారు. ఇచ్చిన మాటకు కట్టు బడి జగనన్న సంక్షేమ పథకాలను అందించి ప్రతి కుటుం బాన్ని ఆర్థికంగా అభివృద్ధి దిశలో పయనింప జేశారన్నారు. అనంతరం సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమం లో రాష్ట్ర కార్యవర్గ ప్రధాన కార్యదర్శి బాలాజీ, వార్డుమెంబర్ అంబిక, షబ్బీర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కేశవులు పలువురు పాల్గొన్నారు.


సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎంపిపి లత బాలాజీ